


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 10 | శుక్రవారం 10-01-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## అమల్లోకి వచ్చిన
# భూభారతి చట్టం
## బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్

**- సత్వరం చట్టం అమలకు చర్యలు తీసుకుంటాం - రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్,జనవరి9:** 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని పేర్కొన్నారు. ఇందులో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ 20వ తేదీన భూభారతి బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన విషయం తెలిసిందే. అనంతరం డిసెంబర్ 30వ తేదీన గవర్నర్ కార్యాలయానికి భూభారతి బిల్లు చేరింది. ఈరోజు భూభారతి చట్టానికి ఆమోదం తెలుపుతూ గవర్నర్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో త్వరలోనే భూభారతి మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మార్గదర్శకాలపై సర్కార్ కసరత్తు చేస్తోంది. ఆర్వోఆర్ - 2020 వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని



అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని విమర్శించారు. కొందరికి సేవ చేయడానికి మాత్రమే పరిమితమైన రెవెన్యూ సేవలను అందరికీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కాగా... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని రద్దు చేసి భూభారతి పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ర్వోఆర్-2020ను కూడా పూర్తిగా ప్రక్షాళన చేస్తూ.. ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది.

ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ 18న భూభారతి చట్టం బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టగా.. అదే నెల 20, 21 తేదీల్లో శాసనసభ, మండలి ఆమోదం తెలిపింది. ఆపై గర్నవర్‌కు ఈ బిల్లును పంపగా.. ఈరోజు భూభారతికి ఆమోదం తెలిపారు గవర్నర్. భూభారతితో రైతులకు ప్రయోజనం చూకూరుతుందని ఇది వరకే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరి గుప్పిట్లోనే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు విస్తరించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. గ్రామాలలో రెవెన్యూ సేవలు అందించేందుకు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇప్పటికే కసరత్తు కొలిక్కి వచ్చిందని తెలిపారు.

ప్రభుత్వ ఆలోచనల కు అనుగుణంగా రెవెన్యూ విభాగం పనిచేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందని.. రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన 95శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. జీహెచ్‌ఎంసీలో 88శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి అయ్యిందని వివరించారు.


## 13 నుంచి సిఎం రేవంత్
# విదేశీ పర్యటన
### అనుమతించిన ఎసిబి కోర్టు



**హైదరాబాద్,జనవరి9:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు తెలంగాణ ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చింది. జనవరి 13 నుంచి 23 వరకు విదేశీ పర్యటనకు వెళ్లేందుకు కోర్టు అనుమతించింది. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి తన పాస్‌పోర్టును కోర్టుకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించారు. బ్రిస్బేన్, దావోస్, ఆస్ట్రేలియా, సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనలకు వెళ్లాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆరు నెలల పాటు తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం.. జులై 6లోగా పాస్‌పోర్టును తిరిగి అప్పగించాలని ఆదేశించింది.


## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే
# పోటీ చేస్తున్నా : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,జనవరి 9:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరపున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్



పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## అలా అయితే ఇండియా కూటమి
# ముగించండి : ఒమర్ అబ్దుల్లా



**న్యూఢిల్లీ, జనవరి 9:** జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల వరకే అయితే 'ఇండియా' కూటమి పొత్తును ముగించాలని సూచించారు. ఆ కూటమికి నాయకత్వం, ఎజెండా వంటివి ఏమీ లేకపోవడాన్ని ఆయన విమర్శించారు. 'ఇండియా' కూటమిలో భాగమైన ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేయడంపై గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఒమర్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. 'దీని గురించి నేను ఏమీ చెప్పలేను. ఎందుకంటే ఢిల్లీ ఎన్నికలతో మాకు సంబంధం లేదు. ఆప్, కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో ఉన్న ఇతర పార్టీలు బీజేపీని ఎలా ఎదుర్కోవాలో నిర్ణయించుకోవాలి' అని అన్నారు. కాగా తనకు తెలిసినంత వరకు 'ఇండియా' బ్లాక్‌కు ఎలాంటి కాలపరిమితి లేదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు కూటమి సమావేశాన్ని నిర్వహించడం లేదని చెప్పారు. దీంతో కూటమి నాయకత్వం, ఎజెండా, ఉనికి గురించి తనకు స్పష్టత లేదని అన్నారు. 'అది (ఇండియా బ్లాక్) కేవలం పార్లమెంట్ ఎన్నికల కోసమే అయితే వారు కూటమిని ముగించాలి' అని సూచించారు.

## ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ మళ్లీ వాయిదా

**న్యూఢిల్లీ,జనవరి 9:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్?ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది.

# ఏసీబీ విచారణకు హాజరైన కేటీఆర్

**- ఫార్ములా-ఈ కారు రేసు ఒక్క రూపాయి అవినీతి జరగలేదు**

**- రేవంత్‌రెడ్డి హామీలపై నిరంతరం నిలదీస్తాం : కేటీఆర్**

**హైదరాబాద్, జనవరి 9:** ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. మాజీ ఏఏజీ, న్యాయవాది రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు వెళ్లారు. అంతకుముందు నందినగర్‌లోని తన నివాసంలో లీగల్ టీమ్‌తో చర్చించారు. అందేవిధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. కాగా, కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళుతుండటంతో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 'తెలంగాణ బిడ్డగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఒక కార్యకర్తగా, కేసీఆర్ సైనికుడిగా స్వచ్ఛమైన మనసుతో, నిర్మలమైన హృదయంతో మరోసారి చెబుతున్నా.. తెలంగాణ ప్రతిష్ట పెంచడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపడానికి రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశానన్నారు. అవి ఫలించి హైదరాబాద్, తెలంగాణ భారత దేశంలోనే ఒక ప్రధానమైన నగరంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి తీసుకొచ్చేలా పనిచేశాం. తొమ్మిదిన్నర పదేండ్ల తమ ప్రభుత్వంలో మా బావమర్దులకు రూ.11 వందల 37 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చే దౌర్భాగ్యపు పని చేయలేదని తెలిపారు. మంత్రిగా నేను మంత్రిమండలిలో కూర్చుని నా కొడుకు కంపెనీలకు కాంట్రాక్టులు ఇచుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టులు ఇచ్చి ప్రతిఫలంగా ల్యాండ్‌క్రూజర్ కొనుక్కోలేదు. ఆ పనులు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు చేశాన్నారు. ఆ చావు తెలివితేటలు, అవినీతి తెలివితేటలు వాళ్లకే ఉన్నాయని పేర్కొన్నారు. నేను రూ.55 లక్షతో ఎమ్మెల్యేలను



కొనుగోలు చేయడానికి పోయి దొరికిపోయిన దొంగను కూడా కాదని తెలిపారు. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డనని తేల్చిచెప్పారు.ఏ పనిచేసినా తెలంగాణ కోసం, హైదరాబాద్ ప్రతిష్టనుపెంచడానికి చేశానని తెలిపారు. అరపైసా అవినీతి చేయలేదని, చేయబోను అని అన్నారు. కొంత మంది అర్థమై కానివాళ్లు, తెలిసీ తెలియని వాళ్లు, ఏదో కొంత బురదజల్లి తాత్కాలికంగా మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకునే కాంగ్రెస్ వాళ్లకు చెప్పేదొకటే.. నిజం నిలకడమీద తెలుస్తుందన్నారు. మీరు ఇవ్వాళ జల్లే బురద నన్నుగానీ, మా పార్టీని కానీ ఎట్టి పరిస్థితుల్లో మాదృష్టిని మరల్చలేదన్నారు. మేము మాట్లాడుతూనే ఉంటాం. కొట్లాడుతూనే ఉంటాం. గత ఏడాది కాలంగా విద్యుత్ చార్జీలు పెంచొద్దని కొట్లాడింది బీఆర్‌ఎస్. లగచర్లలో రైతులను జైల్లో పెడితే అడ్డుకున్నది బీఆర్‌ఎస్. హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడితే అడ్డుకున్నది బీఆర్‌ఎస్. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే అడుగడుగునా నిలదీసింది కేసీఆర్ బృందం. మా దృష్టిని మేం మరల్చం. నామీద కేసుపెట్టి నన్నేదో చేసి దానివల్ల మా పార్టీ క్యాడర్‌ను, నాయకత్వాన్ని నువ్వు దారి మళ్లింపు, దృష్టి మళ్లింపు దిశగా ప్రయత్నం చేస్తానని అనుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి. అది నీవల్ల కాదు.

## ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన
# ప్రధాని మోదీ

**భువనేశ్వర్,జనవరి 9 :** విదేశీ భారతీయుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించింది. భువనేశ్వర్‌లో జరుగుతున్న 18వ ప్రవాసీ భారతీయ దివస్ సందర్భంగా ఈ రైలును వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎన్‌ఆర్ఐ టూరిస్టుల కోసం ఈ రైలును స్టార్ట్ చేశారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ రైల్వే స్టేషన్ నుంచి ఈ రైలు బయలుదేరింది. మూడు వారాల జర్నీ ఉంటుంది. దేశంలోని పలు సంప్రదాయ, మతపరమైన ప్రదేశాలను ఆ రైలు చుట్టివస్తుంది. ప్రవాసీ భారతీయ ఎక్స్‌ప్రెస్‌ను.. ప్రత్యేక టూరిస్టు రైలును రూపొందించారు. విదేశాల్లో ఉన్న భారతీయుల కోసం ఈ టూరిస్టు రైలు కాన్సెప్ట్‌ను డెవలప్ చేశారు. 45 ఏండ్ల నుంచి 65 ఏండ్ల మధ్య ఉన్నవారు ఈ రైలులో ప్రయాణం చేయవచ్చు. తమ చారిత్రాత్మక మూలాలను టచ్ చేసే రీతిలో ఈ రైలు రూట్‌ను క్రియేట్ చేశారు. ఢిల్లీ నుంచి బయలుదేరిన రైలు.. ఆ తర్వాత అయోధ్య చేరుకుంటుంది. అక్కడ నుంచి పాట్నా, గయా, వారణాసి, మహాబలిపురం, రామేశ్వరం, మధురై, కొచ్చి, గోవా, ఎక్తా నగర్(కేవడియా), అజ్మీర్, పుష్కర్, ఆగ్రా పట్టణాలను ఆ రైలు చుట్టువస్తుంది. ఈ రైలులో 156 మంది ప్రయాణికుల ట్రావెల్ చేసే అవకాశం ఉంటుంది. విదేశాంగ శాఖ, భారతీయ రైల్వే, ఐఆర్సీటీసీ కలిసి .. ప్రవాసీ రైలును స్టార్ట్ చేశారు. వివిధ దేశాల్లోని భారతీయ ఎంబసీల నుంచి ఈ రైలు ప్రయాణికుల కోసం దరఖాస్తు చేశారు. తక్కువ ఆదాయం ఉన్న వారికి ఈ రైలులో



ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నారు. విదేశాంగ శాఖ ప్రకారం.. రైలు టూరుకు చెందిన అన్ని ఖర్చులను కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఆయా దేశాల నుంచి ఇండియాకు వచ్చే ప్రవాసీల రిటర్న్ విమాన ఖర్చులో 90 శాతం కూడా ప్రభుత్వమే పెట్టుకోనున్నది. ప్రయాణికులు కేవలం 10 శాతం ఛార్జీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైలులో టూర్ చేసే వారికి 4స్టార్ హొటల్ అకామిడేషన్ ఇవ్వనున్నారు. రైలు ఆవిష్కరణ గురించి మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ట్వీట్ చేశారు.

# నర్సంపేటలో ప్రభుత్వ నిబంధనలను పాటించని
# ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**వైద్యం పేరుతో ఇష్టానుసారంగా దోచుకోవడం అన్యాయం**

**ఓపి,అనస్తిషియా ఫీజుల పెంపు వెనక్కి తీసుకోవాలి**

**ఆర్డీవో ఆఫీసు వద్ద ఎంసిపిఐ(యు) ఆందోళన**




**తొలి సమయం నర్సంపేట జనవరి 9:**
నర్సంపేట పట్టణంలో పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న ప్రవేట్ ఆసుపత్రులు... ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా ఆసుపత్రులను నిర్వహిస్తూ ప్రజలను దోచుకుంటున్న వైద్యులపై చట్టరీత్య చర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ,డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి డిమాండ్ చేశారు. నర్సంపేట నియోజకవర్గంలో ప్రైవేటు హాస్పిటల్ లో ఓపి అనస్థీషియా ఫీజుల పెంపు ఆలోచనలను ఐఎంఏ విరమించుకోవాలని కోరారు. బుధవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ(ఐక్య)-ఎంసిపిఐ (యు) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వైద్యం పేరుతో నిబంధనలు విరుద్ధంగా దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులపై వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట ఆర్టీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి కార్యాలయ అధికారికి మెమోరాంథం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల అనారోగ్యాలను ఆసరా చేసుకుని వైద్యం పేరుతో నిబంధనలు పాటించకుండా ఆసుపత్రులకు వచ్చే పేద మధ్యతరగతి రోగులకు ఓపి టెస్టులు ఐపి ఆపరేషన్ అంటూ వేలాది రూపాయలను మానవత్వం ప్రదర్శించకుండా దోచుకుంటున్నారని అవసరం లేకున్నా అదిక కమిషన్ వచ్చే మందులను రాస్తున్నారని ఈ క్రమంలో డాక్టర్లు వైద్యాన్ని వ్యాపారంగా మార్చుకొని సేవా దృక్పథాన్ని మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకి మెడికల్ డ్రగ్ మాఫియా పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్యాలు గాలిలో దీపంలా తయారైందని అనారోగ్యం బారిన పడితే ఆస్తులన్నీ అమ్మి అప్పుల పాలై దిక్కుతోచని పరిస్థితుల్లో ఉంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో ఇవేమీ చాలవు అన్నట్లు ఐఎంఏ ఆధ్వర్యంలో ఓపి అనస్థీషియా ఫీజులు పెంచడం అన్నారు. ఇప్పటికైనా అలాంటి ఆలోచన విరమించుకొని ప్రభుత్వా నిబంధనల ప్రకారం ప్రజలకు వైద్యాన్ని అందించి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే ప్రైవేట్ ఆసుపత్రులపై తనిఖీ నిర్వహించి నిబంధనలను పాటించని ఆసుపత్రులపై వైద్యులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు ఎండి. మాషుక్, నాయకులు బెజ్జంకి అచల, గణిపాక బిందు, గడ్డం నిర్మల, జన్ను నీల, తిరుపల్లి లక్ష్మి, పల్లెపు. ఐలమ్మ. తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కడియం శ్రీహరి దళితుల హక్కులకై కీలక పాత్ర పోషిస్తున్నారు

**డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**



**తొలి సమయం హనుమకొండ జిల్లా (జనవరి 9):**
కాంగ్రెస్ పార్టీ ఎస్సీ కార్యాలయంలో నాయకులతో కలిసి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ మాజి ఉపముఖ్యమంత్రి మరియు స్టేషన్ ఘనపూర్ సీనియర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి తను ఎమ్మెల్యే అయినప్పటి నుండి ఏ పదవిలో ఉన్న ముఖ్యంగా దళితుల కోసం పాటుపడుతున్నారు . రాష్ట్రంలో దళిత చర్మకారుల కోసం తోలు పరిశ్రమల స్థాపనలో ముందున్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని గురుకులాలను ఏర్పాటు చేయడంలో రాష్ట్రంలో కీలక పాత్ర పోషించారు. బాగా చదివే మెరిట్ పిల్లల కోసం బెస్ట్ అవైలబుల్ స్కీమును తీసుకువచ్చి పలు ప్రైవేట్ స్కూళ్లలో స్కాలర్షిప్లు ఇప్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారు. దళిత కులంలో ఉన్న కులాలన్నీ సమాన హక్కులు వారి జనాభా దామాషా ప్రకారం హక్కులు పొందాలని ఆనాడు వర్గీకరణ విషయంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో మాట్లాడి ఒప్పించడంలో ముందున్న కడియం శ్రీహరి గారు ఈనాడు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ముందుంటున్న కడియం శ్రీహరి కి ధన్యవాదాలు . రాష్ట్రంలోని పేద దళితుల కోసం కార్పొరేషన్ కి బడ్జెట్ పెంచడంలో సాంఘిక సంక్షేమ శాఖకు నిధులు పెంచడంలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ లో నిధులు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కడియం శ్రీహరి గారిని కొందరు బిఆర్ఎస్ లో ఉన్న నాయకులు విమర్శించడం మానేయాలని ఇదేవిధంగా భవిష్యత్తులో కొనసాగితే దళిత సమాజం కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు ఊరుకోబోమని హెచ్చరించారు. దళితుల హక్కుల సాధనలో రాష్ట్రంలోని దళిత సంఘాలు కాంగ్రెస్ పార్టీతో కలిసి నడవాలని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే దళితుల అభివృద్ధి అని డాక్టర్ రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎసి డిపార్ట్మెంట్ చీఫ్ అడ్వైజర్ కొమ్ముల బాబు రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ శ్వేత హనుమకొండ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ మండల అధ్యక్షులు హనుమకొండ మేరీ కాజీపేట రమేష్ ఆత్మకూరు బిక్షపతి పరకాల చంద్రమౌళి నడి కూడా సాంబయ్య గీసుకొండ రాజు సంగం రాజు భీమ గాని వినయ్ సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## యువతీని వేధించిన కేసులో నిందితుడికి జైలు శిక్ష

**తొలిసమయం మడికొండ జనవరి9:**



మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తూ ఉన్న ఒక యువతీని అదే గ్రామానికి చెందిన అఖిల్ అను యువకుడు వేధించడంతో ఆ అమ్మాయి మడికొండ పోలీస్ స్టేషన్ నందు దరఖాస్తు ఇవ్వగా ఆ దరఖాస్తూ మీద మహిళా వేధింపుల కేసు నమోదు చేయడమైనది. ఈ కేసులో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా ముద్దాయికి జైలు శిక్ష విధించడమైనది. ఈ సందర్భంగా మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవిస్తూ మహిళల పట్ల ఎవరైనా అమర్యాద పూర్వకంగా ప్రవర్తించిన, వారిని ఏవిధంగా ఇబ్బందులకు గురిచేసిన చట్ట రీత్యా చర్యలు తీసుకొనబడతాయి అని తెలిపారు.

## వృద్ధులను ఆదుకున్న డిఆర్.ఆర్. ఫౌండేషన్

**దాసరిపల్లి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన రూరల్ ఎస్సై అరుణ్**

**తొలి సమయం నర్సంపేట జనవరి 9:**
దాసరిపల్లి గ్రామంలోని చలితో వణుకుతున్నా వృద్ధుల కోసం గ్రామానికి చెందిన ప్రముఖ ఎన్నారై దాసరి రాజిరెడ్డి ఆధ్వర్యంలో డిఆర్ఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసి గురువారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక రూరల్ ఎస్సై అరుణ్ పాల్గొని మాట్లాడుతూ చలి తీవ్రత ఎక్కువ ఉంటుంది కాబట్టి వృద్ధులు జాగ్రత్తగా ఉండా లని అదేవిధంగా రాబోయే కొత్త వైరస్ ను తట్టుకోవడానికి ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని ఉద్దేశించి ప్రసంగించారు. గ్రామంలోని వృద్ధులకు సుమా రు 350 దుప్పట్లను, రూరల్ ఎస్సై అరుణ్ దుప్పట్లను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఆర్గనైజర్ మేకల రాజేందర్, లెంకల మల్లేష్, మహేష్ముద్దం రవి,కుక్కలమల్లేష్, బుదగొండ బిక్షపతి గ్రామస్తులు పాల్గొన్నారు.



## తుంబూరు దయాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా
## కలసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్



**తొలి సమయం భద్రాద్రి కొత్త జనవరి 9:**
గూడెం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ ఈ నెల 12వ తేది నాడు పాల్వంచ పెద్దమ్మతల్లి గుడి నుండి కొత్తగూడెం విద్యానగర్ లోని మంత్రి క్యాంప్ కార్యాలయం వరకు నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీకి రావాలని ఆహ్వానించారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన కార్తీక్ ను తుంబూరు దయాకర్ రెడ్డి శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ వారికి మంత్రి పొంగులేటి వెన్నుదన్నుగా ఉంటారని, క్షేత్రస్థాయిలో పనిచేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ సభ్యులైన కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కుంచెం వెంకటేష్, పల్లి ప్రణయ్, తాటి పవన్, కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ జయ సూర్య లను చీకటి కార్తీక్ పరిచాయం చేసారు.

## తిరుపతి ఘటనపై పురంధేశ్వరి దిగ్భ్రాంతి

**అమరావతి,జనవరి 9:**
తిరుపతి తోపులాటలో భక్తుల మృతిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయాలైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. తిరుమల తిరుపతి చరిత్రలో ఇటువంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**తొలి సమయం దంతాల పెల్లి జనవరి 8:**
దంతాలపల్లి మండల కేంద్రంలో ఏఎంసి వైస్ చైర్మన్ మరియు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ సీఎం ఆర్ఎఫ్ చెక్కులు తిరిగి పంపిణీ చేయడం జరిగింది లబ్ధిదారులు నిరుపేద కుటుంబానికి చెందిన వారికి సీఎంఆర్ ద్వారా వచ్చే డబ్బులు వారి కుటుంబాలకు సహాయపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము వాసు జిల్లా యూత్ ఉపాధ్యక్షులు ఆవల సురేష్ మండల యూత్ సంపేట సురేష్ మండల పార్టీ నాయకులు ఎస్కే జానీ పాషా బాలాజీ అనిల్ తదితరులు పాల్గొన్నారు

### కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త నిరుపేదకు
## 50 కిలోల బియ్యం అందజేత

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బట్టు నాయక్**

**తొలి సమయం దంతాలపల్లి జనవరి 8**



దంతాలపల్లి మండలంలో బొల్లం మైసయ్య కుటుంబాన్ని దంతాలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలు కాపాడుకుంటానని వారికి పార్టీ తరపున మా అన్నదండలు ఎప్పుడు తన వంతు సహకారం ఉంటాయని తెలియజేశారు వారిని ఓదార్చి వారి కుటుంబానికి తన వంతు సహకారంగా 20 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కొమ్మ వాసు జిల్లా ఉపాధ్యక్షులు ఆవల సురేష్ యూత్ అధ్యక్షులు సంపేట సురేష్ మండల పార్టీ నాయకులు తండా రాములు ఎస్కే జానీ పాషా బాలాజీ రమేష్ అనిల్ నరేష్ లక్ష్మణ్ కొమురయ్య సంపత్ తదితరులు పాల్గొన్నారు

### చాంబర్ ఆఫ్ కామర్స్ తొర్రూరు ఆధ్వర్యంలో
## ఉచిత కంటి శిక్షణ శిబిరం



**తొలి సమయం తొర్రూరు జనవరి 8**
తొర్రూరు మండలంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిక్షణ శిబిరం రేపు అనగా తొమ్మిదో తారీకు జనవరి 2025 గురువారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించబడును నిర్వహణ స్థలం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనం కంటెపాలెం రోడ్డు కావున ఎవరికైనా కంటి సమస్యలు ఉంటే రేపు ఉదయం ఈ యొక్క సదా అవకాశాన్ని వినియోగించుకోగలరు


### రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల బహుమతి ప్రధానం చేసిన
## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు తొలి సమయం జనవరి 8**




తొర్రూరు మండలం పరిపురాల గ్రామం లో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడోత్సవ బహుమతి అందజేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి విజేతలైన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు మొదటి బహుమతి మరియు ద్వితీయ బహుమతి తృతీయ బహుమతి పొందిన జట్లకు టోపీలు నగదు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేసినారు ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు పోటీ సామర్థ్యాన్ని నాయకత్వం గుణాలను జట్టుగా పనిచేసిన నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు క్రీడల ద్వారా యువత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని వారి భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు అంబేద్కర్ యువజన సంఘం గ్రామస్థాయిలో క్రీడల ప్రచారం మరియు యువతకు అవకాశం కల్పించడం చూపిస్తున్న కృషిని ప్రశంసించారు మరియు అంబేద్కర్ యువజన సంగం తరపున రాష్ట్రస్థాయి క్రీడలు ఏర్పాటుచేసిన వారికి ప్రత్యేకత కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రపంచ రికార్డులో చోటు చేసుకున్న
# ప్రజాకవి తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్



**హుజురాబాద్ /జనవరి 09:** హుజురాబాద్ కరీంనగర్ జిల్లాకు చెందిన మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంటర్నేషనల్ భారత్ ప్రతిభ రత్న అవార్డు గ్రహీత, ప్రజాకవి రచయిత సామాజికవేత్త సాహితీవేత్త తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు, బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్ గారి సామాజిక, ఆధ్యాత్మిక అత్యుత్తమ సేవలను అంతర్జాతీయ భారత్ వరల్డ్ రికార్డు కమిటీ సత్యం గౌడ్ సేవలను గుర్తించి, చతుష్టి కలలు, సంక్రాంతి సంబరాలు మరియు గణతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా వీరిని ప్రపంచ భారత్ వరల్డ్ రికార్డు అవార్డుకు ఎంపిక చేసి ,ఈ యొక్క అవార్డును హైదరాబాదులోని రవీంద్ర భారతిలో గురువారం అంతర్జాతీయ భారత్ వరల్డ్ రికార్డు కమిటీ వ్యవస్థాపకులు కదిరి వెంకటరమణ రావు గారితో పాటు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన.. డాక్టర్ సముద్రాల వేణుగోపాల చారి ఫార్మర్ ఆఫ్ పార్లమెంట్ అండ్ మినిస్టర్, చకిలం అసోసియేషన్ డైరెక్టర్ చకిలం సుధాకర్, ప్రజ కవి తత్వవేత్త బ్రహ్మశ్రీ ఆధ్యాత్మిక గురువు డాక్టర్ నాగుల సత్యం గౌడ్, ఇంటర్నేషనల్ ఫిలిం జూరీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కమిటీ డాక్టర్ నాగులపల్లి పద్మిని, టీవీ అండ్ మూవీ ఆర్టిస్టు బేబీ శ్రీదేవి గార్లు సత్యం గౌడ్ కు పట్టు శాలువా కప్పి జ్ఞాపకం అందజేసి, మెడలో రికార్డు ఐడి కార్డు ధరింపజేసి, జేబుకు భారత్ వరల్డ్ రికార్డు మెడల్ను ధరింపజేసి, ప్రపంచ భారత్ వరల్డ్ రికార్డు అవార్డు ను ప్రధానం చేసి ఘనంగా సత్కరించారు ... ఈ సందర్భంగా భారత్ వరల్డ్ రికార్డు కమిటీ వ్యవస్థాపకులు కదిరి వెంకట రమణ రావు గారితో పాటు ముఖ్య అతిథులు సముద్రాల వేణుగోపాల చారి, పద్మిని, చకిలం సుధాకర్ గార్లు మాట్లాడుతూ.... సత్యం గౌడ్ సామాజిక, ఆధ్యాత్మిక సేవలు అభినందనీయమని, ముఖ్యంగా... విద్యార్థులు ప్రయోజకులుగా ఎదగాలనే సంకల్పంతో సెమినార్లు నిర్వహిస్తూ, ప్రతి విద్యార్థి ప్రయోజకుడిగా ఎదగాలని కాంక్షించే సత్యం గౌడ్ నిస్వార్థ సేవలు ఆదర్శప్రాయం అన్నారు. కవిగా, రచయితగా సమాజానికి ఉపయోగపడే రచనలు రాణిస్తూ, ఆవిష్కరిస్తూ .. విలువలు పెంపొందించే రచనలు చేస్తున్న సత్యం గౌడ్ రచనలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతున్నవనీ అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని, బోధన చేస్తు.. ఆధ్యాత్మిక గురువుగా ఎంతో ఆధ్యాత్మిక జ్ఞానం కలిగిన సత్య గౌడ్ బోధనలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా.... ప్రజాకవి రచయిత తత్వవేత్త ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యం గౌడ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని, మంచి మార్గాన్ని ఎంచుకొని సన్మార్గంలో జీవిస్తూ ప్రశాంతమైన జీవితాన్ని గడపాలన్నారు. మనం ఏర్పరచుకున్న విలువలు కాపాడుకుంటూ విలువైన పౌరులుగా ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణలో, దేశభక్తిలో ముందంజలో ఉండి దేశ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలన్నారు. ఎందరో నృత్య కళాకారులను, కవులను, కళాకారులను, సామాజిక వేత్తలను, సమాజానికి ఉపయోగపడే విద్యావేత్తలను, ప్రోత్సహిస్తూ కలనే వృత్తిగా దైవంగా భావిస్తూ ,ఎందరికో సత్కారాలు అవార్డులు, వరల్డ్ రికార్డు అవార్డులు అందజేస్తున్న అంతర్జాతీయ భారత్ వరాలు రికార్డు సంస్థ వ్యవస్థాపకులు కదిరి వెంకట రమణారావు గారు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కవులు రచయితలు గురువులు విద్యావేత్తలు డాక్టర్లు ప్రొఫెసర్లు వివిధ సంస్థల డైరెక్టర్లు చైర్మన్లు డాక్టర్లు న్యాయవాదులు చిన్నారులు నృత్య కళాకారుల పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగ,నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగాలి

**- ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు కి కృషి**

**- కామారెడ్డి ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**







**తొలి సమయం కామారెడ్డి**
:ఉద్యోగ నిరుద్యోగపట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ అల్ఫోర్స్ వి నరేందర్ రెడ్డివెల్లడించారు.. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం పాల్గొని.. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిభారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 300 మంది పట్టభద్రులకు వివిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్ ను అందజేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అల్ఫోర్స్ విద్యాసంస్థల యజమానిగా నేను ఎంతో మంది విద్యార్థులను విద్యావంతులుగా తయారు చేశాను. ఎంతో మంది పట్టభద్రులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాను. వారి బాధలు విన్నాను. వారి సమస్యలు అర్థం చేసుకునాన్నను. వారికి అండగా నిలిచాను. వారి సమస్యల పరిష్కారం కోసం ఒక విద్యా సంస్థల యజమానిగా కృషి చేశానని వెల్లడించారు.. తాను గత 4నెలల నుండి %మీజ% సెగ్మెంట్ పరిధిలో ఉన్నా 42 అసెంబ్లీ నియోజక వర్గాలు పర్యటించడం జరిగిందని . ఈ క్రమంలో వేలాదిమంది విద్యావంతులను, నిరుద్యోగ యువతను, వివిధ రంగాలలో పనిచేస్తున్నా ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఉద్యోగులను కలవడం జరిగిందని అన్నారు...ఈ సందర్భంగా అనేక సమస్యలు తన దృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు... విద్యావంతుడైన తనను ఆశీర్వదించాలని %మీజ% గా పోటీచేయడానికి మీ ముందుకు వస్తున్నానని ఎందుకంటే గత 34 సంఎల నుండి మీ అందరిలో ఒక్కడిగా ఉంటూ మీ అందరి ఆశీర్వాదంతో ప్రతి కుటుంబ సభ్యుడిగా నన్ను ఆదరించాలని కోరుతున్నాను. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు స్టడీ మెటీరియల్ తో కూడిన పాఠ్యపుస్తకాలను అందజేసినట్టుస్పష్టం చేశారు .. చదువుకున్న ప్రతి– ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత తనపై ఉందని, నిజామాబాద్ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు నెలరోజుల పాటు మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పించడం జరిగిందని వెల్లడించారు.. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ పట్టబద్రులకు ఉచిత కోచింగ్ సెంటర్లను నెలకొల్పుతానని పేర్కొన్నారు..యువత ఉద్యోగ ఉపాధి కల్పన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు...తన సొంత ఖర్చులతో ఎమ్మెల్సీ పరిధిలోని ప్రతి జిల్లా కేంద్రంలో కోచింగ్ సెంటర్లను నెలకొల్పుతానని అ అన్నారు...తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కు బాసటగా నిలిచేందుకే రానున్న పట్టభద్రులు ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు..గతంలో ఎమ్మెల్సీగా గెలిచిన నాయకులు పట్టభద్రుల సమస్యలను విస్మరించి పూర్తిగా రాజకీయాలకే సమయం కేటాయించారని అన్నారు... రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగ నిరుద్యోగ సమస్యలపై మండలిలో గలమెత్తుతానని అన్నారు.

# సింగరేణి మండల పరిధిలో మోసం...ఆందోళనలో ప్రజలు

**తొలి సమయం,మహబూబాబాద్**
సింగరేణి మండలంలోని పోలంపల్లి పంచాయతీ ఇటీవల భారీ మోసానికి కేంద్రంగా నిలిచింది. చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని మరియు ప్రజలను మోసం చేసే ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ మోసంలో ప్రధాన పాత్రధారి "జగత్ కిలాడి" అని స్థానికులు అంటున్నారు.




**ఒరిజినల్ డాక్యుమెంట్ చేతుల్లో ఉండగానే రిజిస్ట్రేషన్**
కారేపల్లి మండల కేంద్రంలోపోలంపల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి భూమి ఒరిజినల్ డాక్యుమెంట్ అసలైన యజమాని వద్ద ఉండగానే, తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, అవి నిజమైనవిగా చూపించి ఆస్తిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు సమాచారం.

**సమర్థంగా చట్టాన్ని వంచించిన ఘనుడు**
ఈ ప్రక్రియలో, జగత్ కిలాడి అటు పోలీసులను, ఇటు రిజిస్ట్రేషన్ అధికారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, బాధితులను న్యాయబద్ధంగా లంచాలు అందించడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రభుత్వంపై, ప్రజలపై దోపిడీ**
అటు ప్రభుత్వాన్ని మోసం చేయడంలోనూ, ఇటు ప్రజలను నష్టపరిచే విధంగా వ్యవహరించడం ఈ ఘటనలో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇటువంటి మోసాలు ప్రజల్లో భద్రతాపై నమ్మకం కోల్పోతున్న పరిస్థితిని సృష్టిస్తున్నాయి.

**తక్షణ చర్యల కోసం ప్రజల డిమాండ్**
ఈ సంఘటనతో బాధితులు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ, ఈ మోసంపై సంబంధిత అధికారులు వెంటనే దర్యాప్తు చేపట్టి న్యాయం చేయాలని కోరుతున్నారు. జాగ్రత్త చర్యల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇంకా ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రానున్నాయి... ఇంకా మరింత సమాచారం కోసం వేచి ఉండండి.

# నేడు ముక్కోటి ఏకాదశి

**ముస్తాబైన వెంకటేశ్వర స్వామి దేవాలయం**

**ఉత్తర ద్వార దర్శనం**

**వెంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రధాన అర్చకులు శ్రీకాంత శర్మ**

**తొలి సమయం తొర్రూరు జనవరి 9**



10.01.2025 శుక్రవారం రోజున పుష్య మాసం దశమి తిది రోజు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామీ దివ్య దర్శనం ఉత్తరాయణ ప్రారంభ రోజున ఉత్తర ద్వార దర్శనం. భక్త కోటికి బ్రహ్మాండ స్వామి వారి దర్శనం ఉదయం నుండి స్వామి వారి దర్శనం చేసుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు తీసుకొని స్వామి వారి కరుణ కటాక్షాలు భక్తులు పొందగలరు.స్వామి వారి దివ్య దర్శనం చేసుకొని ప్రజలు సుఖ సంతోషా లో అష్టైశ్వర్యాలతో ఉండాలని వెంకటేశ్వర స్వామి ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ తెలిపినారు.

### కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త నిరుపేదకు
# 50 కిలోల బియ్యం అందజేత

**కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బట్టు నాయక్**



**తొలి సమయం దంతాలపల్లి జనవరి 9**
దంతాలపల్లి మండలంలో బొల్లం మైసయ్య కుటుంబాన్ని దంతాలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలు కాపాడుకుంటానని వారికి పార్టీ తరఫున మా అన్నదండలు ఎప్పుడు తన వంతు సహకారం ఉంటాయని తెలియజేశారు వారిని ఓదార్చి వారి కుటుంబానికి తన వంతు సహకారంగా 20 కేజీల బియ్యాన్ని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కొమ్మ వాసు జిల్లా ఉపాధ్యక్షులు ఆవల సురేష్ యూత్ అధ్యక్షులు సంపేట సురేష్ మండల పార్టీ నాయకులు తండా రాములు ఎస్కే జానీ పాషా బాలాజీ రమేష్ అనిల్ నరేష్ లక్ష్మణ్ కొమురయ్య సంపత్ తదితరులు పాల్గొన్నారు

### తొర్రూరు కోర్టు ఏజీబీ ని సత్కరించిన
# ఏఎంసి వైస్ చైర్మన్ బట్టు నాయక్



**తొలి సమయం దంతాలపల్లి జనవరి 9**
తంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు నాయక్ తరుకోటి ఏజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం వారి శాలతో సత్కరించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీరాం రావుల వెంకన్న రమేష్ రామచంద్రయ్య కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

### నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన
# పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం తొర్రూరు జనవరి 9**
పాలకుర్తి ఎమ్మెల్యే దేవరుప్పుల మండలంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి మరియు ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి నూతన కార్యాలయాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే శేషం రెడ్డి మరియు ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా సమస్యలు వినేందుకు పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందని సూచించారు పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ నూతన కార్యాలయం ఏర్పాటు చేసినందున మండల కాంగ్రెస్ కార్యకర్తలకు పరిశ్రమ కేంద్రం అయ్యేలా తీర్చిదిద్దాలని కోరారు ప్రజల భవిష్యత్తు మార్గ నిర్దేశం కార్యకర్తల తమ పాత్ర సమర్థవంతంగా నిర్వహించాలని చూపించారు పార్టీ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని స్థానిక ప్రజలు ఆకాంక్షలను నెరవేర్చారానికి శ్రమించాలని సూచించారు ఇట్టి కార్యక్రమంలో అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ మండల అధ్యక్షులు నల్ల శ్రీరామ్ మండల పార్టీ ముఖ్య నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఘటనలో నిర్లక్ష్యానికి మూల్యం

**- డీఎస్పీ రమణకుమార్...గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిలపై వేటు**

**- ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ల బదిలీ - ఇవో సహా అధికారుల తీరుపై సిఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం**

**తిరుపతి,జనవరి9:** తిరుపతి తొక్కిసలాట ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై తితిదే పరిపాలన భవనంలో సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడారు. 'డీఎస్పీ రమణ కుమార్ బాధ్యత లేకుండా పనిచేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన రమణ కుమార్, గోశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేశాం. ఎస్పీ సుబ్బరాయుడు, జేఈవో గౌతమి, సీఎస్‌వో శ్రీధర్‌ను తక్షణమే బదిలీ చేస్తున్నాం. ఘటనపై న్యాయ విచారణ జరిపిస్తాం అని ప్రకటించారు. తితిదే ద్వారా మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తాం. తిమ్మక్క, ఈశ్వరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి రూ.5 లక్షల చొప్పున సాయం చేస్తాం. గాయపడిన 33 మందికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున పరిహారం అందిస్తాం. బాధలో ఉన్నప్పటికీ స్వామివారి దర్శనం చేసుకోవాలనే సంకల్పం వారిలో ఉంది. 35 మందికి శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తాం' అని చంద్రబాబు తెలిపారు. ఇకపోతే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద జరిగిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనను ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు జీర్ణించుకోలేకపోతున్నారు. ఘటనపై ఆరా తీసినప్పటి నుంచి సమీక్ష సమావేశం వరకు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతూనే ఉన్నారు.. టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం.. ఇంకా కొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా.. బాధితులను పరామర్శించిన సీఎం చంద్రబాబు..ఆ తర్వాత టీటీడీ పరిపాలనభవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొక్కిసలాట ఘటనతో పాటు రేపటి వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై కూడా చర్చించినట్టుగా తెలుస్తుండగా.. ఈ సమావేశంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకన్న చౌదరీ, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరులు, ఎస్పీ సుబ్బారాయుడు, మంత్రులు సత్యకూమార్, నిమ్మల, ఇతర అధికారులు పాల్గొన్నారు.. తొక్కిసలాట సహా జరిగిన ఘటనలపై 40 నిమిషాలకుపైగా చర్చించారు. అయితే,టీటీడీఉన్నాధికారుల తీరుపై చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమీక్షలో టీటీడీ ఈవోపై తీవ్ర స్థాయిలో మండిప డ్డారు. అజాగ్రత్తగా ఉండడం వల్లే ఇంతటి దుర్ఘటన జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు.. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)ని ప్రక్షాళన చేస్తానన్న నమ్మకంతోనే ప్రజలు మాకు ఓట్లు వేశారు. ఆ నమ్మకాన్ని వమ్ము చేయబోమన్నారు. అసలు దర్శన టోకన్ల కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఎందుకు పెట్టలేదు..? అని సమావే శంలో నిలదీశారు.. మరోసారి ఇలాంటి ఘటనలు జరిగితే ఏ మాత్రం సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు.

# మొన్న లడ్డూ..ఇప్పుడు తొక్కిసలాట

**- వైకుంఠ ద్వారం కాదు..వైకుంటానికే పంపారు - తిరుపతి ఘటనపై మండిపడ్ పిసిసి చీఫ్ షర్మిల**

**- మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్**



**విజయవాడ,జనవరి9:** వైకుంఠ ద్వార దర్శనం కోసం వెళ్తే ఏకంగా వైకుంతానికే పంపుతున్నారని అంటూ తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మండిపడ్డారు. గోవింద నామాలు ప్రతిధ్వనించాల్సిన చోట ఘోరమైన మృత్యుఘోష వినిపించిందన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా కనీస ఏర్పాట్లు చేయకపోవడం పాలనా యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమంటూ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం, టీటీడీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు చనిపోయిన ఘటనపై నైతిక బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్నారు. వారి ఇంట్లో అర్హులు ఉంటే ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఏపీసీసీ పక్షాన ముఖ్యమంత్రి చంద్రబాబుని డిమాండ్ చేస్తున్నామన్నారు. మొన్న లడ్డు కల్తీ.. నేడు తొక్కిసలాట... కోట్లాది హిందువుల ఆరాధ్య దేవుడు, కలియుగ దైవం వెంకన్న క్షేత్రానికి మచ్చ తెచ్చి పెట్టాయన్నారు. తొక్కిసలాట ఘటనపై వెంటనే అత్యున్నత విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వైఎస్ షర్మిల రెడ్డి పేర్కొన్నారు. కాగా.. వైకుంఠ ద్వార దర్శనం కోసం టీటీడీ ఏర్పాటు చేసిన టోకెన్ కౌంటర్ల వద్ద గత అర్ధరాత్రి తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఐదుగురు మహిళలు ఉన్నారు.

మరికొంతమంది గాయపడగా.. ప్రస్తుతం వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలను రాష్ట్ర మంత్రులు పరామర్శించారు. అలాగే ఆస్పత్రులకు వెళ్లి క్షతగ్రాలను పరామర్శించారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనపై సీరియస్ అయ్యారు. అయితే ఇవేవీ సంఘటనను మరిపించలేవన్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.


# ఒక్కో సినిమాకు ఒక్కో తీరా..?

**- గేమ్ ఛేంజర్‌కు ఎందుకు అదనపు షోలు - సీఎం రేవంత్‌పై ఫైర్ అయిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**



**హైదరాబాద్, జనవరి 9:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి నిరూపితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గేమ్ ఛేంజర్ సినిమాకు ఎందుకు అదనపు షోలు..? టికెట్ రేట్ల పెంపు ఎందుకు..? అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు, అదనపు షోలకు అనుమతిస్తూ జారీ చేసిన జీవోతో రేవంత్ రెడ్డిది రెండు నాల్కల ధోరణి అని అర్థమైపోయింది. టికెట్ల పెంపుదల ఉండదు అని అసెంబ్లీ సాక్షిగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఆయన ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారు. ఈ జీవోపై వివరణ ఇవ్వాలి. గేమ్ ఛేంజర్ సినిమా వచ్చేసరికి రేట్ల పెంపుదలకు అవకాశం ఇచ్చారు. ఆయనకు ప్రత్యేకమైన ప్రివిలేజ్ ఎందుకు..? ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు షోలు ఉండవని సీఎం నెల రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించారు. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు ప్రివిలేజ్ ఇస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. నిజానికి దిల్ రాజు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడు కూడా కలిసి రాలేదు. ఏ ఒక్క రోజు కూడా తెలంగాణకు అండగా నిలబడలేదు. సంక్రాంతికి వస్తున్నాం ఫంక్షన్‌లో తెలంగాణ కల్చర్‌ను దిల్ రాజు అవమానించాడు. ఆయనకు ఆంధ్రాలోనే సినిమాలకు వైబ్ ఉంటుందట. తెలంగాణలో వైబ్ ఉండదట. అయితే తెలంగాణలో సినిమాలు మానుకో దిల్ రాజు. కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకో.. ఇక్కడ వైబ్ ఉంటుంది. నీకు కావాల్సింది వైబ్ కదా. ఇక్కడి సినిమాలకు వైబ్ ఉండదని అంటున్నవ్ కదా.. అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. సినిమా టికెట్ రేట్లు పెంచమన్న రేవంత్ రెడ్డి పూటకోమాట మార్చుతున్నాడు. సినిమాటోగ్రఫి శాఖ మంత్రి టికెట్ రేట్ల పెంపుదల ఉండదని ప్రకటించారు. మరి దీనిపై సమాధానం చెప్పాలి. సినిమాలు విడుదలైతే టికెట్ రేట్లు పెంచి పేద ప్రజల జేబులు లూటీ చేయొద్దన్నాడు రేవంత్ రెడ్డి. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు పెంచాల్సిన అవసరం వచ్చింది. నిజాయితీ లేని ముఖ్యమంత్రి, మంత్రులు ఉండటం దురదృష్టకరమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలేవీ !




పేదల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రూపాయికే కిలోబియ్యం పథకం పందికొక్కుల పాలవుతోంది. ఇదంతా పెద్ద మాఫియాగా మారింది. బియ్యం మొత్తం విదేవాలకు తరలుతున్నాయి. కొందరు అధికారులు, రాజకీయ నేతలు కలసి దీనిని బడా వ్యాపారంగా మార్చేశారు. రూపాయికే కిలో బియ్యం పథకంలో లోపాలు కళ్లకు కనిపిస్తున్నా తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కావాలనే అచేతనంగా ఉండిపోయాయి. పథకం దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోవడం లేదు. 42 ఏళ్ల క్రితం కిలో రెండు రూపాయలుగా ఉన్న బియ్యాన్ని తలకుమాసిన నేతలు అధికారంలోకి వచ్చి..కిలో రూపాయి చేశారు. ఇప్పటికే జనాభాలో 80శాతం మందికి ఈ బియ్యం ఇస్తున్నట్లు చెబుతున్నారు. అయినా ఇంకా కొత్తగా రేషన్ కార్డుల డిమాండ్ పుట్టుకొస్తోంది. పాతవాటిలో అక్రమాలను అరికట్టి, బియ్యం ధరలు పెంచి పక్కాగా పథకాన్ని అమలు చేయాల్సిన ఇరు రాష్ట్రాల సిఎంలు ఇంకా ప్రజలను మభ్య పెడుతున్నారు. వేలకోట్లు దుర్వినియోగం అవుతున్న ప్రజాధనానికి ఎవరు బాధ్యులు అన్నది చెప్పడం లేదు. ప్రజలు చెమటోడ్చి కడుతున్న పన్నుల డబ్బులను ఇష్టారీతిన వృధా చేయడమేనా పాలకుల పని అని ప్రజలు నిలదీయాల్సి ఉంది. ఇకపోతే ఎపిలో పేదల బియ్యం పూర్తిగా పక్కదారి పట్టాయి. రాష్ట్రంలో పేదలకు అందాల్సిన సబ్సిడీ బియ్యం టన్నుల కొద్దీ అక్రమంగా విదేశాలకు తరలించిన తీరు బయటపడ్డా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ప్రతిపక్ష వైసిపి కారణమని టిడిపి కూటమి ఆరోపిస్తుంటే, మీరే కారణమని వైసిపి నేతలు టిడిపి, జనసేన నేతలను విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారు. లక్షల టన్నుల బియ్యాన్ని కొన్నేళ్ళుగా యథేచ్ఛగా తరలిస్తూ వచ్చారు. అసలు దోషులు బయట పడకుండా పేదల బియ్యాన్ని పెద్దలు గద్దల్లా ఎగరేసుకుపోయారు. తెలంగాణలో సైతం ఇలాంటి దోపిడీ జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఓట్లమీద ఉన్న శ్రద్ధ అక్రమాలను అరికట్టడంలో కనిపించడం లేదు. ప్రజా పంపిణీ ద్వారా పేదలకు అందుతున్న బియ్యం అసలు పేదలకు అందడం లేదన్నది అక్షర సత్యం. ఈ బియ్యం ఆటో, లారీల స్థాయి దాటి ఓడల వరకు చేరిందని రుజువయ్యింది. బియ్యం పథకం పంపిణీ కార్యక్రమం కేంద్రానిదని, ప్రతి స్టోర్ దగ్గర మోడీ ఫోటో పెట్టాలని తెలంగాణ, ఆంధ్రలో పెద్ద యాగీ చేసిన కేంద్ర మంత్రులు, బిజెపి పెద్దలు అక్రమ బియ్యం తరలింపు విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు. ఎందుకు దీనిపై చర్యలకు ఉపక్రమించడం లేదు. అన్ని రకాల సబ్సిడీ పథకాలను రద్దు చేసి సమీక్షించాలి. నిజమైన పేదలను గుర్తించాలి. దుబారా పథకాలకు కాలం చెల్లిందన్న విధంగా కళ్లెం వేయాలి. నగదు బదిలీ పథకాల అమలుపై సమీక్షించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఓట్లు ముడిపడి వున్నందున దీనిని సమీక్షించడం సాధ్యం కావడంలేదు. పేదలు రేషన్ బియ్యం ఎందుకు అమ్ముకుంటారన్న చర్చ చేయాలి. బహిరంగ మార్కెట్‌లో కనీసం 40లుగా ఉన్న బియ్యం ఇప్పుడు రూపాయికే దక్కితే అవి పెద్ద వ్యాపార వస్తువుగా మారింది. ఓడలకు ఎక్కించగలిగినంత బియ్యం అమ్మగలగడం ఇందుకు నిదర్శనం. ఎపిలో గత ఐదేళ్ళలో 1.31 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని టిడిపి కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. కాకినాడ ఓడరేవులో సిద్ధంగా వున్న ఓడను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనిఖీ చేసి సీజ్ చేయమని ఆదేశించారు. విశాఖపట్నం ఓడరేవులో రాష్ట్ర సివిల్ సప్లరు శాఖ మంత్రి ఇలాగే ఓ ఓడను తనిఖీ చేసి అందులో వున్న బియ్యం పేదల బియ్యమేనని ప్రకటించారు. ఇక తెలంగాణలో ఎంత దోచకున్నారో కిక్కురుమనడం లేదు. ఒకవైపు తిండి లేక పేదలు అల్లాడుతుంటే ఇంత పెద్ద ఎత్తున అక్రమంగా తరలిస్తున్న బియ్యం దొంగలను పట్టుకుని కఠినంగా శిక్షించాల్సిందే. అధికార పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అనర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంవల్ల, అందులో ఎక్కువ మంది బియ్యం అమ్ముకునే వారు వుండే అవకాశం ఉంది. కానీ అత్యధిక పేదలు రేషన్ బియ్యంతోనే నెలలో కొద్ది రోజులైనా కడుపు నింపుకుంటున్నారు. ఇలా అక్రమాలను పక్కన పెట్టి సన్న బియ్యం ఇస్తామని ఒకరు, నాణ్యమైన బియ్యం ఇస్తామని మరొకరు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత...బియ్యాన్ని వ్యాపారంగా మార్చేస్తున్నారు. రేషన్ కార్డులకు ఇస్తున్న బియ్యానికి కిలో రూ.43.50 ఖర్చు అవుతుందని ప్రభుత్వం చెబుతున్నది. ఇంత ఖర్చు చేసినా పేదలకు మంచి బియ్యం ఎందుకు ఇవ్వలేకపోతున్నారన్నది కూడా ప్రశ్నే. ధాన్యం సేకరణ నుండే పాలకులు, ఉన్నతాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారు. నివాస ప్రాంతాల్లో స్టోర్ల ద్వారా పంపిణీ కావాల్సిన బియ్యాన్ని నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలించి నాయకులు అప్పనంగా సంపాదించుకుంటున్నారు. గ్రామాల వారీగా కార్డులు ఉన్నవారి వివరాలు సేకరించి, అందులో పేదలు ఎంతమందన్నది గుర్తించాలి.

## మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

**బెయిల్ విచారణ ముగిసేవరకు అరెస్ట్ చేయొద్దని ఆదేశం**

**హైదరాబాద్,జనవరి9:** సినీనటుడు, దర్శక, నిర్మాత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్ పై విచారణ జరుగుతోందని, ఆ విచారణ ముగిసేంతవరకు మోహన్‌బాబును అరెస్ట్ చేయవద్దని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసుపై ముందస్తు బెయిల్ మంజూరుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో ఆయన ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం జస్టిస్ సుధాంశు ధులియా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో మోహన్‌బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను అరెస్టు చేయవద్దంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మోహన్ బాబు బెయిల్ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జర్నలిస్ట్ పై దాడి కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ మెహన్ బాబు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన వయసు 78 ఏళ్లని, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నానని అందుచేత తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో సుప్రీం కోర్టు నుంచి తనకు సానుకూల తీర్పు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన అనుకున్నట్టుగానే గురువారం విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

## డాకూ మహారాజ్ ప్రీ ఈవెంట్ రద్దు

**తిరుపతి ఘటన నేపథ్యంలో నిర్ణయం**

**అనంతపురం,జనవరి9:** అనంతపురం వేదికగా శుక్రవారం జరగాల్సిన 'డాకు మహారాజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేశారు. బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రానున్న చిత్రమే 'డాకు మహారాజ్'. సంక్రాంతి కానుకగా జనవరి 12న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో అనంతపురంలో ఘనంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావించింది. ఆ ఈవెంట్‌కు ముఖ్యఅతిథిగా బాలకృష్ణ అల్లుడు నారా లోకేశ్ వస్తున్నట్లు కూడా తెలిపింది. అయితే తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో దీన్ని రద్దు చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'తిరుపతిలో జరిగిన ఘటనకు మా చిత్రబృందమంతా ఎంతో బాధ పడుతోంది. పవిత్ర స్థలంలో ఇలాంటి ఘటన జరగడం హృదయ విదారకంగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను జరపడం సరికాదని భావిస్తున్నాం. బాధాతప్త హృదయంతో, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని అత్యంత గౌరవంతో నేడు జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం. ఈ కష్ట సమయంలో మీ అందరి మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాం' అని నిర్మాణ సంస్థ పేర్కొంది. తిరుపతిలోని వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మరణించిన విషయం తెలిసిందే. తిరుపతి ఘటనపై బాలకృష్ణ స్పందించారు. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోవడం అత్యంతబాధాకరమని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఘటనా ప్రాంతాన్ని సందర్శించిన పవన్

**ప్రమాద వివరాలు తెలిపిన అధికారులు**

**తిరుపతి,జనవరి9:** వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల పంపిణీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి చేరుకున్నారు. బైరాగిపట్టెడలోని పద్మావతి పార్క్‌కు చేరుకున్న డిప్యూటీ సీఎం.. తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును జేసీ శుభం బన్సల్, డీఎస్పీ చెంచుబాబు పవన్‌కు వివరించారు. భక్తులను ఎందుకు ఒకేసారి క్యూలైన్లలోకి వదలాల్సి వచ్చిందని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. హైవేకు దగ్గరగా ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున పద్మావతి పార్క్‌కు వచ్చారని అధికారులు వివరించారు. టోకెన్ల కోసం తరలి రావడంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో టోకెన్ల జారీ కౌంటర్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు.. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, రాజకీయ నేతలు ఇలా.. బాధితులను పరామర్శిస్తున్నారు.. తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడంతో, ఆ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యక్షంగా పరిశీలించారు .. ప్రమాదం జరిగిన తీరును, కారణాలను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎస్పీ చెంచుబాబు, చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత.. స్విమ్స్‌కు వెళ్లిపోయిన పవన్ కల్యాణ్.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు..

## తిరుపతి తొక్కిసలాట ఘటనలో కుట్రకోణం

**టీటీడీ బోర్డు మెంబర్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు**

**అనంతపురం,జనవరి9:** తిరుపతి తొక్కిసలాట ఘటన చాలా బాధకరమని టీటీడీ బోర్డు మెంబర్ మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తిరుపతి ఘటనలో కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కావాలనే కొంతమంది అరుపులు సృష్టించి తొక్కిసలాటకు కారణం అయ్యారని తెలుస్తోందని చెప్పారు. అందరి కంటే ముందే వైసీపీ సోషల్ మీడియాలోకి వీడియోలు ఏలా వచ్చాయనేది దర్యాప్తు చేస్తున్నామని అన్నారు. శవ రాజకీయం చేయడం వైసీపీకి ముందు నుంచి అలవాటు అని ఆరోపించారు. వైసీపీ సోషల్ మీడియాలో టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అనవసర ప్రచారాలను భక్తులు నమ్మొద్దని అన్నారు. ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనలను వైసీపీ రాజకీయాలకు వాడుకుంటోందని ఆక్షేపించారు ఎంఎస్ రాజు. వైకుంఠ ద్వార దర్శనం కోసం టీటీడీ అన్ని చర్యలు తీసుకుందని తెలిపారు. డాకు మహారాజ్ సినిమా ఈవెంట్ జరగాల్సి ఉంటే తిరుపతి ఘటన వల్ల రద్దయిందని ఎంఎస్ రాజు ప్రకటించారు.

## మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ

**విశాఖపట్నం టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి**

**విశాఖపట్నం,జనవరి9:** తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని విశాఖపట్నం టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జి తెలిపారు. మృతుల కుటుంబాల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ ఘటనపై వైఫల్యాలకు కారణమైన వారి మీద చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ చెప్పారని గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశంపై కూడా విపక్షాలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. 2.8 లక్షల కోట్ల ప్రాజెక్టులు శంకుస్థాపనలు ప్రారంభించారని చెప్పారు. గతంలో తెచ్చామని చెప్పే వ్యక్తులు, విపక్ష పార్టీలు ఆరోజు ఎందుకు ప్రారంభించలేకపోయారని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం దోపిడీల మీదే దృష్టి పెట్టిందని అన్నారు. విమర్శలు చేసే మాజీ మంత్రి, గుడివాడ అమర్నాథ్ రెండున్నర సంవత్సరాల్లో, అనకాపల్లికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు. మైకు దొరికింది కదా అని, ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఊరుకునేది లేదని గండి బాబ్జి హెచ్చరించారు.

## తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి**

**అమరావతి,జనవరి 9:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తులు మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచార కరమని అన్నారు. తక్షణం అక్కడ పరిస్థితులను చక్కదిద్దడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101